రాణి మల్లమ్మ దేవి పార్కును సందర్శించిన మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి : రాణి మల్లమ్మ దేవి మునిసిపల్ పార్క్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన స్పింకర్ పైప్ లైన్ ను మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఈశ్వర గుప్త తో కలిసి మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి సందర్శించారు.రాణి మల్లమ్మ దేవి మున్సిపల్ పార్కు నందు ఇటీవల ఏర్పాటు చేసిన స్పిన్కర్ పైప్ లైన్లు పనితీరును పరిశీలించి ప్రతిరోజు మొక్కలకు మరియు కార్పెట్ గ్రాస్ కు నీళ్లు విధిగా వదలాలని వాటి పర్యవేక్షణ నిమిత్తం ఇద్దరు వర్కర్లను మరియు సూపర్వైజర్ ను ఏర్పాటు చేసి ప్రతిరోజు పర్యవేక్షించాలని మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఈశ్వర గుప్త కి ఆదేశించారు.

ఆర్గానిక్ ఉత్పత్తులు ఆరోగ్యకరం

- ఆర్గానిక్ పంటలకు ప్రోత్సాహం
- కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్
- కలెక్టరేట్ లో ఆర్గానిక్ సంతకు అనూహ్యస్పందన

విశాలాంధ్ర-విజయనగరం: ఆర్గానిక్ ఉత్పత్తులు ఆరోగ్యానికి మంచి చేస్తాయని కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద ప్రకృతి సహజ సిద్ధంగా రైతులు పండించిన ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను జిల్లా కలెక్టర్ అంబేద్కర్, జే.సి సేతు మాధవన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ మాట్లాడి ఎన్ని ఎకరాల్లో సాగుచేస్తున్నారు, ఎంత పెట్టుబడి పెడుతున్నారు, ఎంత లాభంవస్తోంది, అందులో సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన రైతులు ఈ సంత లో

పలు రకాల ఆకుకూరలు, కూరగాయలు, చిరు ధాన్యాలు, ఆర్గానిక్ బెల్లం, పలు వెరైటీల కొత్త బియ్యం , ఆర్గానిక్ వంటకాలు, తిను బండారాలు, అరిసెలు, ఇతర మిటాయి లు, భోగి పిడకలు, అరటి, జామ పండ్లు తదితర ఉత్పత్తులను ప్రదర్శించారు. మధ్యాహ్నం 1 గంట వరకు విక్రయించగా కలెక్టరేట్ , చుట్టూ పక్కల శాఖల నుండి విచ్చేసిన ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై కొనుగోళ్ళు చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా తో మాట్లాడుతూ జిల్లాలో పెద్ద ఎత్తున ఆర్గానిక్ వంటలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 12 వేల ఎకరాల్లో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నారని, ప్రజలు కూడా ఈ ఉత్పత్తుల పై ఆసక్తి కనబరుస్తున్నారని, ఈ సాగును పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తారక రామ రావు, ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాల ఇస్తానన్న చంద్రబాబు.. మాట నిలబెట్టుకోవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచార సభల్లో ఇచ్చిన హామీ మేరకు సొంత గృహం లేక అద్దెలు చెల్లిం చలేక తీవ్రఇబ్బందులెదుర్కొంటున్న నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చే భాధ్యత కూటమి ప్రభుత్వానిది అని చెప్పిన మాట నిలబెట్టుకోవాలి అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు.ఇళ్లులేని నిరు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కూటమి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యునిస్టు పార్టీ (సిపిఐ) విజయ నగరం నియోజకవర్గ కార్యదర్శి బుగత అశోక్ ఆధ్వర్యంలోశుక్రవారం ఉదయం విజయనగరం తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఇళ్ల స్థలాలకు నీలా కూర్మనాథ్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఒమ్మి రమణ మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇళ్ళు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు,గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు కేటాయిస్తామన్న వాగ్దానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన జగనన్న నివేశనా స్థలాల లబ్ధిదారులకు పట్టణాల్లో సెంటుకు బదులుగా రెండు సెంట్లు,గ్రామాల్లో సెంటున్నరకు బదులు మూడు సెంట్లు ఇస్తామన్న ముఖ్యమంత్రి

చంద్రబాబు హామీ నెరవేర్చాలని కోరారు.అలాగే గృహ నిర్మాణానికి 5 లక్షలు రూపాయలు మంజూ రు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు ఎ రాములు, బూర వాసు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

అన్నం రాజుపేటలో చిన్నశ్రీను పూజలు

విశాలాంధ్ర -జామి/ విజయనగరం టౌన్: శ్రీ ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలం లోని అన్నమరాజుపేట గ్రామంలో ఉమ్మడి విజయనగరం జెడ్పీ

ఛైర్మన్, వైసీపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాస రావు (చిన్న శ్రీను), సతీమణి మజ్జి పుష్పాంజలి, కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర శుక్రవారం శ్రీ వేణుగోపాల స్వామిని వైకుంత ద్వారం ద్వారా దర్శించుకున్నారు. ముందుగా ఆలయ నిర్వాహకులు, వేదపండితులు వారికి పూర్ణ కుంభంతో స్వాగతం ఫలికారు. వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు చేసి వేద పండితుల ఆశీర్వాదం పొందారు.ఈ కార్యక్రమంలో జామి మండలం వైయస్సార్సీపి మండల పార్టీ కన్వీనర్ గొర్లి రవికుమార్ , జెడ్పిటీసి సరయు, వైస్.ఎం. పీ.పి. విజయలక్ష్మి, సర్పంచ్ చెల్లూరు సూర్యనారాయణ, శేషు, ఫణి బాబు,పొంద్రంకి సంజీవి, సింగారపు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో వాటర్ ప్లాంట్ పనులు పునరుద్ధరణ

సత్యనారాయణకు గ్రామస్తుల అభినందనలు

విశాలాంధ్ర-మెరక ముడిదాం: మెరకముడిదాం మండలం బిళ్ళలవలస గ్రామంలో 2018 సం॥ నుండి నిరుపయోగంగా వున్న వాటర్ ప్లాంటను తన

సొంత మొత్తంతో అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు కె సత్యన్నారాయణ బాగు చేసి ప్రజలుకు అందుబాటులోకి తెచ్చారు. దీంతో గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. కొన్ని నెలలు నుండి తాగునీటికి గ్రామస్తులు ఇక్కట్లుకు గురయ్యేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవటం గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సత్యన్నారాయణ ధాత్రుత్వానికి గ్రామ పెద్దలు అభినందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు టి సుబ్బరాజు, సర్పంచ్ అధికార ప్రతినిధి వర్మరాజు, శివాజీ రాజు, శ్రీను రాజు, చిరంజీవి రాజు, సంతోష్ వర్మ, విజయకుమార్, శ్రీరామ్, చంటి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమణ భూమిలో బోర్డు పాతిన రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర-వేపాడ: మండ లంలోని వీలుపర్తి గ్రామ పంచాయతీ శివారు పెద దుంగాడ రెవిన్యూలోని సర్వే నంబరు 65లో సుమారు 25 సెంట్లు మెట్ట పోరంబోకు భూమిని రియల్ భూ వ్యాపారి ఆక్రమించుకొని చదును చేసుకున్న విషయంపై విశాలాంధ్ర దినపత్రికలో మెట్టపోరంబోకు భూమి ఆక్రమణ అనే కథనంపై స్పందించిన రెవెన్యూ అధికారులు శుక్రవారం భూ పరిశీలన చేపట్టి రియల్ వ్యాపారి సుమారు 15 సెంట్లు ప్రభుత్వ మెట్ట పోరంబోకు భూమిని ఆక్రమించినట్టు గుర్తించి అందులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు.ఇది ప్రభుత్వ భూమి ఆక్ర మించిన వారు చట్టరీత్యా శిక్షార్హులని బోర్డు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసరావు సచివాలయ సర్వేరు అరవిందు వీలుపర్తి వీఆర్ఏ రాము తదితరులు పాల్గొన్నారు.

గోకులం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర -లక్కవరపుకోట: గోకులం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం మండలం లోని ఎల్కోట తలారి

గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోకులాలు వసతిషెడ్డులను ప్రారం భించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే పవన్ కళ్యాణ్ పాడి పరిశ్రమ రైతులు అభివృద్ధి చెందడం కొరకు ఈ పథకం ప్రవేశపెట్టారని ఉచితముగా ఉపాధి హామీ పథకము క్రింది రాష్ట్ర ప్రభుత్వము 90 శాతం, కేంద్ర ప్రభుత్వము 10 శాతం నిధులు మంజూరు చేస్తుందని మండలంలో 38 గోకులాలు షెడ్డులు మంజూరు కాగా 13 గోకులం షెడ్డు లు నిర్మాణం పూర్తి అయ్యాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చొక్కాకుల మల్లు నాయుడు, మాజీ జడ్పిటిసి సభ్యులు కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కోటాయాడ రాముదు, మాజీ సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, కాసాపేట సర్పంచ్ కోళ్ల భూపాల్ నాయుడు, ఎ.పి.ఓ. ఎం. విజయలక్ష్మి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : రఘుపాత్రుని రవికుమార్ భార్య లలిత ఇటీవల స్వర్గస్తులైంది. ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో తలమునకలయ్యారన్న విషయం తెలుసుకుని శుక్రవారం డాబల్ కాలనీలో ఎంపిజి ఈశ్వరరావు, బలివాడ వెంకట రమణారావు, బుదరాయ వలస మధుసూధనరావు ఆధ్వర్యంలో అతనికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు. మానవతా దృక్పథంతో ఆలోచించి సరుకులు అందజేసినందుకు రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రఘుపాత్రుని అనురాధ, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

అవంతి రీసెర్చ్ లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర -భోగాపురం: మండలం లో బసవ పాలెం అవంతి రీసెర్చ్ అండ్ టెక్నాలజికల్ అకాడమీలో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. కళాశాలలో విద్యార్థులు ,ఉపాధ్యాయులు ముగ్గులు, కోలాటాలు,

గొబ్బెమ్మలు, గంగిరెద్దులు తో సందడి చేసారు. సంక్రాంతి పాటలకు విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. విద్యా ర్థులు, ఉపాధ్యాయులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. సాంప్రదాయ బద్ధంగా పల్లె వాతావరణం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పురిల్లు, గంగిరెద్దుల విన్యాసం, పిండి వంటలు బొమ్మల కొలువులు విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సంక్రాంతి సంబరాలను ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి గోవిందరావు మాట్లాడుతు సంక్రాంతి సంస్కృతిని, పండగను నేటి తరం మర్చిపోతున్న తరుణంలో ఆ విశిష్టత తెలిపేలా తమ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది అన్నారు. కార్యక్రమంలో అవంతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి గోవిందరావు, కళాశాల పరిపాలన అధికారి జి అశోక్ కుమార్, అవంతి కళాశాలల ప్రతినిధి ముత్తం శెట్టి మహేష్, వైస్ ప్రిన్సిపాల్ కె. భాస్కర్ రావు, వివిధ విభాగాల అధిపతులు, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర -విజయనగరం టౌన్: జిల్లా పోలీసుశాఖలో వివిధ హెరీదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ జిల్లా పోలీసు కార్యాలయంలో "పోలీసు వెల్ఫేర్ డే"నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపిఎస్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యతకల్పిస్తానన్నారు. పోలీసు వెల్ఫేర్ డేనిర్వహించుటలోభాగంగా పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబరులోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన జిల్లా ఎస్పీ, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను జిల్లా ఎస్పీ స్వయంగా పుస్తకంలో నోట్ చేసుకొని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని తెలిపారు.

ఉద్యోగులకు ఆర్థిక బకాయిలు చెల్లించి, కరువుభత్యం ప్రకటించాలి

విశాలాంధ్ర -విజయనగరం టౌన్ : ఏపీటీఎఫ్ (1938) జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎం బలరాం నాయుడు అధ్యక్షతన జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వి పైడ్రాజు నిర్వహణలో సంఘ

కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఏ.సదాశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్నఉత్తరాంధ్ర శాసనమండలి ఎన్నికలలో గాదె శ్రీనివాసులు నాయుడును`గెలిపించాలన్నారు. ఉద్యోగులకు ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని కరువుభత్యం ప్రకటించాలన్నారు. మధ్యంతర భృతి ప్రకటించాలని 12వ పిఆర్సి కమిషన్ వెంటనే నియమించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ కృష్ణ,ఎన్ శ్రీదేవి, ఏవి శ్రీనివాసరావు, సి హెచ్ పైడితల్లి, సి హెచ్ వి ఎస్ ఎన్ మూర్తి, పీ, దామోదర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతం కళాశాల విద్యార్థికి జాతీయ, అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో పతకాలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న కె.జగదీష్ అనే విద్యార్థి స్కూల్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా

ఆధ్వర్యంలో నవంబర్ నెల 16 నుంచి 18 వరకు నార్త్ గోవాలో జరిగిన జాతీయ 10వ ఓపెన్ స్కూల్ గేమ్స్ లో రాష్ట్రం తరపున పాల్గొని అండర్-19 బాక్సింగ్ పోటీలలో 60-63 కిలో గ్రాముల బరువు కేటగిరీలో బంగారు పతకం, డిశంబర్ నెల 20 నుండి 24వ తేదీల్లో నేపాల్ లో జరిగిన ఇండోనేపాల్ స్కూల్ గేమ్స్ ఛాంపియన్షిప్ ఓపెన్ బాక్సింగ్ అండర్-19 అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో,60-63 కిలోల బరువు కేటగిరిలో రజత పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ రావు విద్యార్థిని ఉద్దేశించి మాట్లాడుతూ అతను ఎంచుకున్న రంగంలో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక బహుమతితో సత్కరించారు. ఈ క్రీడాభినందన సభలో మొదటి సంవత్సరం విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలత, ఇతర అధ్యాపకులు, విభాగాధిపతులు, ఫిజికల్ డైరెక్టర్లు మహేశ్వర రావు,శ్రీదేవి, సీ.ఎస్.ఓ సత్యనారాయణ, కోచ్ లు రామాంజనేయులు, నిఖిల్, ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.

నమస్తే పథకంలో పేర్లు నమోదు

విశాలాంధ్ర -విజయనగరం అర్బన్ : నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నమస్తే పథకంలో పలువురు పారిశుధ్య కార్మికులు తమ పేర్లను నమోదు

చేసుకున్నారు. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు పారిశుద్య కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకుని నమస్తే కార్యక్రమం ద్వారా రక్షణ కల్పించుకుంటున్నారు. వృత్తిపరమైన శిక్షణ, జీవనోపాధి పెంపొం దించుకు నేందుకు యాంత్రిక పద్ధతుల్లో పనితీరును మెరుగు పరిచేందుకు సులభతరం అయ్యేందుకు నమస్తే కార్యక్రమం ద్వారా ఆస్కారాన్ని కల్పించుకుంటున్నారు.

అర్హులైన పేదలకు 3 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలి

సిపిఐ డిమాండ్

విశాలాంధ్ర-రామభద్రపురం: అర్హులైన ఇల్లు లేని నిరుపేదలందరికీకూటమి ప్రభుత్వము 3 సెంట్లు ఇల్లు స్థలం ఇవ్వాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అన్నారు. శుక్రవారం తాసిల్దార్ కార్యాలయం వద్ద వివిధ సమస్యలపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగ ఆనందరావు మాట్లాడారు. కొట్టక్కి రెవెన్యూ పరిధిలో 537 సర్వే నెంబర్ లో సుమారు 550 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని అన్నారు. అందులో గత 15 సంవత్సరాల క్రితం ఏపీఐసీసీ కి 200 ఎకరాలు ప్రభుత్వ భూమి కేటాయించడం జరిగిందని అన్నారు. ఆ భూమి లో ఇప్పటివరకు ఎటువంటి పరిశ్రమలు నిర్మించలేదని, అందువలన ఏపీఐసీసీకి ఇచ్చిన భూమిని రద్దు చేసి అర్హులైన భూమిలేని నిరుపేదలకు పంచి పెట్టాలని అన్నారు. అలాగే అదే సర్వే నెంబర్లు కొంతమంది పెత్తందారులు ప్రభుత్వ భూమిని అక్రమించుకొని దర్జాగా చాగు చేసుకుంటున్నారని అలాంటి వారిపై రెవెన్యూ వారు చర్యలు తీసుకోకుండా వారికి సహకరిస్తున్నారని అన్నారు. అర్హులైన పేదలందరికీ భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ ప్రభుత్వము అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ 6 పేరుతో పెద్ద మోసం

చేసిందన్నారు. ఇంతవరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం దారుణమని అన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ గోవింద్ అయ్యాయని అన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు తప్పని డోలీ కష్టాలు

మార్గమధ్యలో గర్భిణీ డెలివరీ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్ కోట మేజర్ పంచాయితీ గిరి శిఖర గ్రామం రేగ పుణ్యగిరి కి చెందిన గిరిజన మహిళ సీదరి శాంతికి గురువారం రాత్రి 11 సమయంలో పురిటి నొప్పులు వచ్చాయి, గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో శాంతి భర్త శివ తోటి గిరిజనుల సాయంతో డోలికట్టి రాత్రి ఒంటిగంట సమయానికి పుణ్యగిరి దేవస్థానం టికెట్ కౌంటర్ వద్దకు తీసుకు రాగా గర్భిణికి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో శాంతి అక్కడే డెలివరీ అయి మగ బిడ్డకు జన్మనిచ్చింది. 108 అంబులెన్స్ కు ఫోన్ చేసినా స్పందించలేదని, ఏఎన్ఎంలు కూడా లేటుగా స్పందించారనీ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గిరిజన గ్రామానికి పీఎం జన్‌మన్ పథకం ద్వారా రోడ్డు మంజూరు చేయాలని జనసేన నాయకులు వచ్చిన సన్యాసి నాయుడు ఆధ్వర్యములో మండలానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ కి ,ఎంఎల్ఏ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి వినతి పత్రాలు అందజేశామన్నారు. ఈ సందర్భంగా

సన్యాసి నాయుడు మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లు 3.5 కిలోమీటర్ల రోడ్డుకి 5.3 కోట్లకి అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి

లెండి లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర -డెంకాద: జొన్నాడ లెండి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో శుక్రవారం ప్రతి ఏడు సంక్రాంతి పండుగ స్ఫూర్తిని పెంపొందించడానికి నిర్వహించే వేడుకల్లో భాగంగా ఎంతో ఆసక్తిగా ఎదురు

చూస్తున్న సంక్రాంతి సంబరాలు 2025ను ఎంతో ఉత్సాహంగా మరియు సాంస్కృతిక కార్యక్రమాలతో జరుపుకుంది. ఈ కార్యక్రమాన్ని ఫెమినా వింగ్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సహకారంతో, నిర్వహించింది.ప్రతికూలతను విడిచి కొత్త ప్రారంభాలను స్వాగతించడం అనే ప్రతీకగా సాంప్రదాయ భోగి మంటతో వేడుకలు ప్రారంభమయ్యాయి. పాయసం మరియు పొంగలి వంటి ప్రసిద్ధ తెలుగు రుచికరమైన వంటకాలను తయారు చేయడం ద్వారా విద్యార్థులు ఉత్సాహంగా తమ పాక నైపుణ్యాలను ప్రదర్శించారు, ఇది ఉత్సవాలకు కొత్త ఊపు నిచ్చింది. హరి దాసులు వేషధారణలో విద్యార్థులు పాల్గొనడం, భక్తి పాటలు పాడుతూ, క్యాంపస్ అంతటా ఆనందాన్ని వ్యాప్తి చేయడం ఈ కార్యక్రమంలో మరొక గొప్ప అంశం. సాంప్రదాయ ఆధునిక నృత్యాలు మరియు పాటలతో సహా వివిధ ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి, విద్యార్థుల ఉత్సాహం నిజంగా సంక్రాంతి స్ఫూర్తి కి జీవం పోసినట్లు కనిపించగా ఈ కార్యక్రమంలో తెలుగు అమ్మాయ్ మరియు అబ్బాయి పోటీలు జరిగాయి, ఇవి సాంప్రదాయ తెలుగు దుస్తుల సొగసును మరియు సాంస్కృతిక ప్రదర్శన కళలో విద్యార్థులను చూపించాయి. ఈ ప్రాంతంలోని ప్రసిద్ధ జానపద నృత్యం అయిన తిమ్సా నృత్యం ప్రత్యేక ప్రదర్శన, మహిళా బృందంచే ప్రదర్శించబడింది. కళాశాల నాయకత్వం ప్రదర్శించిన కృషి మరియు ఉత్సాహానికి ప్రశంసలు అందుకుంది. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి. రామారెడ్డి, వైస్ చైర్మన్ పి. శ్రీనివాసరావు మరియు కార్యదర్శి కరస్పాండెంట్ కె. శివ రామ కృష్ణ వివిధ పోటీలలో విజేతలను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు తమ్మినేని, డీన్లు, విభాగాధిపతులు మరియు ఇతర అధ్యాపక సభ్యులు వేడుకలలో పాల్గొని, తెలుగు సంస్కృతిని కాపాడటానికి మరియు ప్రోత్సహించడానికి విద్యార్థులను ప్రోత్సహించారు. ఫెమినా వింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ జానకి మార్గదర్శకత్వంలో, అధ్యాపక సభ్యులు మాధురి, శ్రావణి, రేవతి మరియు ఇతరుల సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. క్యాంపస్ సంక్రాంతి పండుగ ఆనందోత్సాహాలతో ప్రతిధ్వనించగా విద్యార్థులు తమ వారసత్వాన్ని గౌరవించుకోవడానికి స్ఫూర్తినిస్తూ, సాంస్కృతిక మరియు ఐక్యత సందేశంతో వేడుకలు ముగిశాయి.

సజావుగా కొనసాగుతున్న పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియ

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



విశాలాంధ్ర-విజయనగరం టౌన్: స్టైఫెండరీ పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు పిఎంటి. పిఈటి. పరీక్షల ప్రక్రియ కొనసాగుతున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జనవరి 10న నిర్వహించిన 9వ రోజు పిఎంటి., పిఈటి. పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 408 అభ్యర్థులు మాత్రమే పిఎంటిపి ఈటి పరీక్షలకు హాజరయ్యారన్నారు. నియామకాలప్రక్రియ వేకువ జామున 5గంటల నుండే ప్రారంభం కావడం, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో, పిఎంటి., పిఈటి పరీక్షలు సకాలంలో పూర్తయ్యా యన్నారు. పోలీసు నియామకాల ప్రక్రియను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు.అభ్యర్థులకు ముందుగా హాల్ టికెట్స్ పరిశీలించి, పోలీసు పరేడ్ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం, అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయస్సు నిర్ధారించే ధృవపత్రాలను పరిశీలించి, అన్ని సర్టిఫికేట్స్ సక్రమంగా ఉన్న అభ్యర్థులకు మాత్రమే బయోమెట్రిక్ తీసుకొని, పి.ఎం.టి. పరీక్షలకు అనుమతించామన్నారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన డిజిటల్ ఇక్విప్ మెంట్స్ వినియోగించి, అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలతలను నిర్ధారించి, అర్హత సాధించిన అభ్యర్థులకు పి.ఈ.టి. పరీక్షలను అనుమతించామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ నియామక ప్రక్రియలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డిఎస్పీలు ఎం.వీర కుమార్, యూనివర్స్, ఎస్.బాపూజీ, టి.ఎన్. శ్రీనివాసరావు, కే.థామస్ రెడ్డి, ఎఓ పి.శ్రీనివాసరావు, పలువురు సిఐలు, రిజర్వు ఇన్స్పెక్టర్స్, ఎస్సైలు, ఆర్.ఎస్.ఐ.లు పిఈటీలు ఇతర పోలీసు అధికారులు, పోలీసు కార్యాలయ ఉద్యోగులు పాల్గొని, ఎంపిక ప్రక్రియ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించారు.

రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతీ దరఖాస్తును ఆడిట్ చేయాలి

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతీ దరఖాస్తును క్షున్నంగా పరిశీలించి ఆడిట్ చేసి సానుకూలంగా పరిష్కరించాలనీ జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన్ ఛాంబర్ లో నియోజకవర్గం ఇంచార్జ్ లైన డిప్యూటీ కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తాసీల్దార్లు పరిష్కరించిన ప్రతి దరఖాస్తును ఆడిట్ చేయాలనీ చెప్పారు. సదస్సుల్లో మొత్తం 6846 దరఖాస్తులు రాగా, ఇప్పటికే 2776 దరఖాస్తులను తహసిల్దార్లు పరిష్కరించారని, వాటిని కూడా ఆడిట్ చేయాలనీ తెలిపారు. గ్రామాల్లో అర్జీ దారులను పిలిపించి వారు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం లభించలన్నారు. ఈ దరఖాస్తులను పరిష్కరించితే జిల్లాలో రెవెన్యూ పరమైన సమస్యలన్నీ దాదాపు పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. కోర్టులనుంచి ప్రత్యేకంగా ఏమైనా ఆదేశాలు ఉన్నవి మినహా, వివాదాలు ఉన్న భూములను కూడా పరిష్కరించవచ్చునని సూచించారు. రీ సర్వే లో వచ్చిన దరఖాస్తులను కూడా



రెవిన్యూ సదస్సుల్లో కవర్ అయినది లేనిది పరిశీలించాలన్నారు. సమాధానాలు అస్పష్టంగా ఉండకూడదని అన్నారు. రోజుకి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని డిప్యూటీ కలెక్టర్లు మొత్తం దరఖాస్తులను ఆడిట్ చేయాలన్నారు. సమావేశం లో డిఆర్వో ఎస్.శ్రీనివాస మూర్తి, ఆర్డీవోలు కెఆర్ఆర్సి ఎస్డిసి మురళీ, ఇంచార్జ్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులు పరిశీలించిన క్వాలిటీ కంట్రోల్ డి.ఈ. రమణ ప్రభత్

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని చిన గుడిపాల గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా నిర్మించిన ఇంటింటి కులాయి పనులను గురువారం విజయనగరం జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. చిన గుడిపాల గ్రామంలో జలజీవన్ మిషన్‌లో భాగంగా 80శాతం ఇంటింటి కులాయిలు ఏర్పాటుచేయగా లక్కవరపుకోట సబ్ డివిజనల్ రక్షిత మంచినీటి పథకం డి.ఈ కె ఆర్.వి. పైడిరాజు ఆధ్వర్యంలో విజయనగరం క్వాలిటీ కంట్రోల్ డి.ఈ.రమణ ప్రభాత్, పనులను పరిశీలించారు. అలాగే గ్రామం మొత్తం కలియతిరిగి ఇంటింటి కులాయిల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బోజంకి రామునాయుడు, గుత్తేదారు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి కలెక్టర్ స్థల పరిశీలన

కేన్సర్ స్క్రీనింగ్ అంబులెన్స్ ప్రారంభం

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్: చీడిపాలెం గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు రహదారి నిర్మాణానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్థల పరిశీలన చేశారు. ఆయన శుక్రవారం ఎస్.కోట మండలంలో పర్యటించారు. జాతీయ రహదారి 516-ఇ నుంచి చీడిపాలెం గ్రామానికి రహదారి వేయాలని ఇటీవలే జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన ఈ గ్రామానికి ప్రస్తుతం ఉన్న గ్రావెల్ రహదారిని పరిశీలించారు. తాశిల్దార్ అరుణకుమారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మ్యాప్‌లను పరిశీలించారు. సర్వే చేసి రహదారి నిర్మాణానికి స్థల సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం అక్కడికి సమీపంలోని సాయిపల్లిని కలెక్టర్ సందర్శించారు. శ్రీ సత్యసాయి దివ్యామృతం ఆశ్రమంలో నిర్మాణంలో ఉన్న వంద పడకల కేన్సర్ ఆసుపత్రిని, ఓపి గదులను, భోజన శాలను పరిశీలించారు. ఆసుపత్రికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. శారదా మెటల్స్ అండ్ అల్లాయిస్ లిమిటెడ్ కంపెనీ సమకూర్చిన కేన్సర్ స్క్రీనింగ్ అంబులెన్స్‌ను కలెక్టర్ ప్రారంభించారు. సాయిపల్లికి రహదారి సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు, తాసిల్దార్ అరుణకుమారి, డిప్యుటీ తాసిల్దార్ భరత్, లిటిడిపి అధికార ప్రతినిధి గొంప కృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, సాయిపల్లి ఆశ్రమ స్వామీజి, ఇతర ప్రతినిధులు, శారదా మెటల్స్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

12న వాజీ రంగోలీ పోటీలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సనాతన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందజేయడమే లక్ష్యంగా వాజి ఛానల్ గత 29 సంవత్సరాలుగా రంగోలి పోటీలను నిర్వహిస్తూ వస్తోందని వాజీ ఛానల్ మేనేజింగ్ డైరక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జనవరి 12వ తేదీన ఉదయం 11 గంటలకు ఆనందగజపతి ఆడిటోరియంలో రంగోలి పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ఏడాది రంగోలీ పోటీలలో 3 లక్షల రూపాయల విలువగల బహుమతులను విజేతలకు అందించనున్నామని తెలిపారు. ఈ పోటీలలో ముగ్గు వేసే ప్రతి ఒక్కరికి పలు బహుమతులు అందించనున్నామని అన్నారు. విజయనగరంలో మహిళలను ప్రోత్సహించేందుకు, వారిలో నిబిడీకృతంగా ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికితీసేందుకు గడిచిన 29 ఏళ్లుగా వాజీ నిర్వహిస్తున్న రంగోలీ పోటీలలో ఇప్పటి వరకు సుమారు 20 వేల మంది పాల్గొన్నారని అన్నారు. 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆనందగజపతి ఆడిటోరియంలో వాజీ రంగోలీ, హౌసీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని అన్నారు. డిసెంబర్ 31వ తేదీన వాజీ మెగా హౌసీలో ఫుల్ హౌసీ అయి, పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు నేరుగా ఆనందగజపతి ఆడిటోరియంలో జరిగే బహుమతి ప్రదానోత్సవానికి హాజరు కావాలని సూచించారు.

గోవింద నామ స్మరణతో కిటకిటలాడిన వెంకటేశ్వర స్వామి ఆలయం

విశాలాంధ్ర- విజయ నగరం ఫోర్ట్: జై గోవింద నామస్మరణలతో పట్టణంలోని వైష్ణవాలయాలు ప్రతి ధ్వనించాయి. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా రింగ్‌రోడ్ శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి అధికసంఖ్యలో భక్తులు విచ్చేసారు. రెండువీధులపొడవునా భక్తులు బారులు తీరారు. తెల్లవారుజామున మూడు గంటలకు నగర సంకీర్తన, నాలుగు గంటలకు శ్రీస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వీసపాటి శ్రీమన్నారాయణ ఆచార్యులు, రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో భక్తులకు శ్రీరంగనాథుని ఉత్తర ద్వారం గుండా దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు. మహిళలు శ్రీమాన్ నారాయణుని సమక్షంలో ప్రత్యేక దీపాలు వెలిగించి స్వామి వారి పట్ల భక్తి ప్రపత్తులు తెలుపుకున్నారు. ఆలయ ప్రాంగణంలో తిరువనంతపురంలో మాదిరిగా మూడు విధాలుగా శ్రీ పాదాలు, నాభి భాగం, తిరుముఖ మండలం గా తీర్చిదిద్దారు. భక్తులు హరినామ స్మరణలు, సంకీర్తనలు చేసారు. పుష్కరిణిలో బలభద్ర,సుభద్ర, శ్రీ జగన్నాస్వామి ప్రత్యేక ఆశీనులుచేసి భక్తులకు కనువిందు, ఆధ్యాత్మిక భక్తి భావనలు కలిగించారు. సాయంత్రం నమ్మాళ్వార్ అధ్యయన ఉత్సవం (పరమపద ఉత్సవం) నిర్వహించారు. శ్రీ శ్రీనివాస సేవా సంఘం అధ్యక్షుడు పిల్లా విజయకుమార్, కార్యదర్శి చెరుకూరి శ్రీధర్ పర్యవేక్షణలో భక్తులకు శ్రీ స్వామి వారిని దర్శించుకునేందుకు బారికేడ్లను ఏర్పాటు, ప్రసాదవితరణలు నిర్వహించారు.

ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్

విశాలాంధ్ర-దత్తిరాజేరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ పి. స్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం 35 మంది గర్భిణీ స్త్రీలకు తనిఖీలు, రక్త పరీక్షలు మరియు ఆరోగ్య విద్య నిర్వహించారు. గర్భిణీ స్త్రీలందరకు ఆరోగ్య విద్య ద్వారా వాళ్ళు తీసుకునే ఆహారం గురించి, మంచి పోషక విలువలు కలిగిన ఆహారం,ప్రతిరోజు ఆకుకూరలు క్యారెట్ బీట్రూట్, డ్రైఫ్రూట్స్, ప్రతీ రోజు పాలు తీసుకోవడం ద్వారా క్యాల్షియం పెంపొందించుకొవచ్చుని అన్నారు.4 అంతకు మించిన చెకప్ లు చేయించుకోవడం ఆసుపత్రి ప్రసవాలు ద్వారా తల్లి బిడ్డ సురక్షితంగా ఉండడానికి అవకాశం ఉంటుందని తెలియజేసారు. అనంతరం సాయిరాం భక్తులు పద్మావతి మరియు సభ్యులు గర్భిణీలకు మరియు ఆశ కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డి.వి. గిరిబాబు, ఎంపీహెచ్‌ఓటి. మురళి సి .హెచ్. ఓ లు, ఏ.ఎన్.ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

ఎన్‌జిఓ అరుణ్ కుమార్

విశాలాంధ్ర-లక్కవరపుకోట: బాల్యవివాహాలను నిర్మూలించాలి అని విజయనగరం జిల్లా ఎన్.జి.ఓ అధ్యక్షులు అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐ.సి.డి.ఎస్. వియ్యం పేట ప్రాజెక్టు పరిధిలో ఉన్న మండల స్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండకుండా బాలికలకు వివాహం చేయడం వలన జరుగు నష్టాలను వివరించారు, కౌమార దశలో ఉన్నవారు దేశంలో 20 శాతం జనాభా ఉన్నారు అని తెలిపారు కిషోర్ బాలికల ఉన్నత విద్యను అభ్యసించాలని 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని తెలిపారు. విజయనగరం జిల్లా బాల్యవివాహాల్లో 5వ స్థానంలో ఉందని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఏ.ఎన్.ఎంలు, గ్రామ మహిళా సమాఖ్య సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు, పాఠశాల ఉపాధ్యాయులు, వి.ఆర్.ఓలు బాల్య వివాహాలు జరగకుండా చూడాలని తెలిపారు. పోషకాహారం లోపం వలన శిశు మాతృ మరణాలు జరగకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమము ఎం.పి.డి.ఓ. ఎస్ అప్పారావు, తహసిల్దార్ డి.ఎం.జి.ఎన్. ప్రసాద్ రావు, వైద్య అధికారి బి. అనిల్ కుమార్, ఎం.ఇ.ఓలు చలుమూరు కూర్మా రావు, శ్రీనివాసరావు వేదికపై ఉన్న వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంఎ.సి.డి.పి.ఓ బి లక్ష్మీబాయి, సూపర్వైజర్లు ఈ భాగ్యలక్ష్మి, వెలుగు ఏపీఎ జి శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-గరివిడి : స్థానిక గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో తెలుగువారికి అత్యంత ముఖ్యమైన సంక్రాంతి పండుగ మరో రెండు రోజుల్లో రానున్న నేపద్యంలో శుక్రవారం ఉదయం ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ అధ్యక్షతన సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా ఆవు పాలను కుండలో పొంగించి దానిలో కొత్త బియ్యము,కొత్త బెల్లం వేసి పొంగలి తయారు చేయడంతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం విద్యార్థులకు,ఉపాధ్యాయులకు రంగవల్లికలు, గొబ్బెమ్మలు,ఆటల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి శోభ తెచ్చేలా హరిదాసుల వేషధారణ,ఎడ్లబండి అలంకరణ, గంగిరెద్దుల ఆటపాటలు,సాంస్కతిక నత్యాలు, భోగిమంట వేయడంతో పాటు మన సంస్కృతి ఉట్టిపడేలా సాంప్రదాయ దుస్తులు ధరించి నిర్వహించిన కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఏటా పెద్ద ఎత్తున సంక్రాంతి వేడుకలు నిర్వహించి విద్యార్థులు,ఉపాధ్యాయులు మన సంస్కృతిని మర్చిపోకుండా చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే మకర సంక్రాంతి పండుగ యొక్క విశిష్టతను వివరించారు.ప్రముఖంగా దేశానికి వెన్నెముకైనా రైతు పొలంలో పండించిన పంట ఇంటికి తెచ్చే సందర్భంగా ఈ పండుగను గ్రామాల్లో అట్టహాసంగా నిర్వహిస్తారని తెలిపారు.అందరూ సుఖశాంతులతో బోగ భాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. వివిధ ఆటలలో గెలుపొందిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహుమతులను ప్రిన్సిపాల్ చేతులు మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ,ఏఓ జి.అనిల్ కుమార్,వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు బోధనేతర సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

శ్రీవత్స స్కూల్లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-రాజాం: స్థానిక చీపురుపల్లి రోడ్ లో ఉన్న శ్రీవత్స ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సం క్రాంతి సంబరాలు ఘనంగా జరి గాయి. పాఠశాల చైర్మన్ తులసి రెడ్డి ఆధ్వర్యంలో పలు సంస్కృతి కార్యక్రమాలు సాంప్రదాయ పద్ధతిలో మనంగా జరిగాయి. .భోగిమంట వేయడం .గంగిరెద్దులు ప్రదర్శన మరియు రంగవల్లి పోటీలు నిర్వహించారు .కార్యక్రమానికి ముందుగా గోపూజ జరిగింది అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చైర్మన్ తులసి రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఇంగ్లీష్ విద్యను బోధించే విధంగా శ్రీవత్స ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇంగ్లీష్ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని దీనికి అనుగుణంగానే అందుబాటులో ఉండే విధంగా విద్యను బోధిస్తున్నామని తెలిపారు.

నారాయణ పబ్లిక్ స్కూల్ లో సంక్రాంతి- సంబరాలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నారాయణ పబ్లిక్ స్కూల్ లో తెలుగు భాషా సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి- సంబరాలను" ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు ముగ్గులను వేసి గొబ్బిళ్లను తయారుచేసి సంక్రాంతి వచ్చింది తమ్మీద అను పాటను కోలాటం చేసి ఎంతగానోఆనందపరిచారు.సంక్రాంతి విశిష్టతను తెలిపే హరిదాసు, సోదమ్మ కొమ్మదాసరి, మాడు బసవన్న, రైతు, కాటికాపరి, ఏకాపాత్రాభినయాలు విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. భోగి మంట ప్రత్యేకమైన అకర్షణగా నిల్చింది. సంఘ అధ్యక్షుడు ఆడిచి రామానాయుడు మాట్లాడుతూ సూర్యుడు మకర సంక్రమణ రోజునుండి తేజోమానంగా వెలుగును అని పండగలను వాటి విశిష్టతలను విద్యార్థులకు తెలియపర్చడం ద్వారా ఆచరించి నైదిక విలువలను పెంపొందించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలి : భీశెట్టి బాబ్జీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో ని గ్రామీణ ప్రాంతాల్లో ని విద్యార్థులు కృషి,పట్టుదలతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని, విద్యార్థుల ఉన్నత స్థితికి టేలెంట్ టెస్టులు బాగా ఉపయోగపడతాయని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. శుక్రవారం కొత్తఅగ్రహారం గుంటూరు సుజాత విద్యాసంస్థలో జరిగిన పదవతరగతి విద్యార్థుల టేలెంట్ పరీక్షకు హాజరైన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 2024,25 సంవత్సరం లో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ట్రిపుల్ ఐటిల్లో సీట్లు సాధించారని పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు సినిమాలు, సీరియళ్లు, మొబైల్ ఫోన్ లపై ఆసక్తి చూపకుండా పరీక్షల పై దృష్టి సారించింది మంచి స్థానాలు సాధించాలని భీశెట్టి కోరారు,గుంటూరు సుజాత విద్యాసంస్థలు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా విద్యార్థులకు టేలెంట్ టెస్టులు పెట్టి ప్రోత్సహించడం అభినందనీయమని,గ్రామీణ ప్రాంతాల్లో ని విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించడం చాలా ఆనందంగా ఉంద న్నారు. బహుమతులు పొందిన పదిమంది విద్యా ర్థుల తల్లిదండ్రులు వ్యవసాయదారులు కావడం వారి పిల్లలు గా మీరు చదువుపట్ల శ్రద్ధ చూపడం సంతోషంగా ఉందన్నారు. సుమారు 650 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ టేలెంట్ టెస్టు లో ప్రథమ బహుమతి జి.అఖిల్, ద్వితీయ బహుమతి మీసాల జయవర్ధన్,తృతీయ బహుమతి వై.నిహారిక సాధించారు. సమావేశంలో కరస్పాండెంట్ బి.ఏ.రావు, మంగవేణి, విద్యాసంస్థలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం మెప్మా ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోసం ప్రవేశపెట్టిన శిక్షణ కార్యక్రమాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పిలుపునిచ్చారు.మున్సిపాలిటీ పరిధిలో మెప్మా విభాగంలో సర్వీస్ ప్రొవైడర్లకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మరియు నైపుణ్యం పెంపుదల కోసం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి సమావేశం ఏర్పాటు చేశారు . మున్సిపాలిటీ లోనున్న ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, బ్యూటీషియన్, సెలూన్, కార్పెంటర్, ఫ్రిజ్, కూలర్, ఏసీ , టీ వి రిపేర్స్ మొదలగు కోర్సులలో ప్రవేశం ఉన్న 200 మంది హాజరై తదుపరి నైపుణ్యం పెంపుదల కోసం సిద్ధమై దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రవేశ రుసుం ఒక వెయ్యి రూపాయలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు స్కిల్ అప్ గ్రేడేషన్ శిక్షణ కోసం విజయనగరం వెళుటకు సిద్ధం కావాలని తెలిపారు. తరువాత 3 నెలల శిక్షణానంతరం వీరికి గుర్తింపు కార్డు , డ్రెస్ కోడ్ ఇచ్చిన తరువాత వీరి నీ హెరామ్ ట్రయాంగల్ ఆప్ లో నమోదు చేసి వారికి ఆన్లైన్ ద్వారా సర్వీసెస్ కోసం ఫోన్ చేసిన వారికి సర్వీస్ అందించి సర్వీస్ ఛార్జ్ వసూలు చేసుకోవచ్చును.హాజరు కావలసిందిగా కోరడమైనది. కార్యక్రమంలో మున్సిపల్ టిపిఆర్ఓ ఎం.జగన్మోహనరావు, సి ఎం ఎం ఎం.లలిత, సిఓలు పోలినాయుడు, సింహాచలం,అరుణ జ్యోతి, వరలక్ష్మి, ఆర్.పీ లు సర్వీస్ ప్రొవైడర్స్ పాల్గొన్నారు.

ఈ సర్వేలో విస్తీర్ణం తగ్గిందని విద్యాశాఖ మంత్రి లోకేష్ కు ఫిర్యాదు

భూమిని పరిశీలించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-భోగాపురం : సర్వేలో 10సెంట్లు విస్తీర్ణం తగ్గిందని విశాఖకు చెందిన ఓ మహిళ విద్యాశాఖ మంత్రి లోకేష్ కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో ఆ భూమిని జిల్లా కలెక్టర్ బి ఆర్ అంబేద్కర్ శుక్రవారం పరిశీలించారు. విశాఖకు చెందిన అల్లాడ జయశ్రీ తల్లి మండలంలోని నందిగాం వెళ్లే లక్ష్మీపురం రెవిన్యూ లో చాలా ఏళ్ల కిందట 45 సెంట్లు భూమిని కొనుగోలు చేశారు. కానీ రీ సర్వేలో సర్వే నెంబరు 68/1లో 25సెంట్లు, 68/2లో 10 మాత్రమే నమోదయింది మిగతా 10 సెంట్లు తగ్గింది ఈ మేరకు తహసిల్దార్ ఎమ్ సురేష్, సర్వేయరు మధుకేశ్వరరావు ఆధ్వర్యంలో సర్వే చేశారు. ఆమె గతంలో కొనుగోలు చేసిన భూమి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ప్రకారం భూమి వేరేచోట ఉండగా ఈమె మరో సర్వే నెంబర్లో ఉన్న భూములో అనుభవంలో ఉన్నట్లు తేల్చారు. స్థానిక రెవెన్యూ అధికారులు కూడా ఇదే విషయాన్ని కలెక్టర్ కు వివరించారు. రికార్డు ప్రాప్తికి అక్కడ భూమి లేకపోవడంతో పాటు తప్పు నెంబర్ తో గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు గుర్తించి ఆమెకు కూడా వివరించారు. ఆర్డీవో దాట్ల కీర్తి, తహసీల్దార్ ఎం సురేష్, ఆర్ ఐ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర -వేపాడ: మండలంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారికి శుక్రవారం వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ సారధ్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.ఈ పూజ కార్యక్రమంలో వేపాడ, వల్లంపూడి,దబ్బిరాజుపేట వీలుపర్తి తదితరు గ్రామాల నుండి వందలాదిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకొని తరించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు.

తీర్మానాలు లేకుండా మంజూరైన పనులపై విచారణ

విశాలాంధ్ర-భోగాపురం: పంచాయతీ తీర్మానం లేకుండా పల్లె పండుగ పనుల వ్యవహారంలో దల్లిపేట సర్పంచ్ ఫిర్యాదు మేరకు శుక్రవారం విచారణ నిర్వహించారు. విస్తరణ అధికారి కే గాయత్రి విచారణ చేశారు. పంచాయతీతో పాటు మండల పరిషత్, జిల్లా పరిషత్ తీర్మానాలు లేకుండా దల్లి పేట పంచాయతీలో నాలుగు పనులు మంజూరు కావడంతో ఆ గ్రామ సర్పంచ్ దల్లి టాటా ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రిజ్వాన్, గ్రామ సర్పంచ్ ద ల్లి కాంత, గతంలో పనిచేసిన కార్యదర్శి రమేష్ ను పంచాయతీ కార్యాలయంలో వేరువేరుగా ఆమె విచారించారు. వారు విచారించిన విషయాలు స్టేట్మెంట్ రూపంలో రికార్డు చేశారు. విచారణ నివేదికను జిల్లా పంచాయతీ అధికారితో పాటు ఎంపీడీవోకు అందజేస్తానని ఆమె తెలిపారు